## అనువాదకథ



# మీరెవరి తాలూకా?

హిందీమూలం: యశ్వంత్ కొఠారి

తెలుగు: కాలిపు వీరభద్రుడు

నేనా గదిలోకి వెళ్ళగానే "నువ్వెవరి తాలూకా?" అని వారడిగేరు. "నేను తమవాడ్నే" వెంటనే నేనన్నాను.

అతనన్నారు, "అబద్ధం చెబుతున్నావ్. నా మీద ఫిర్యాదు చేసేవని పిలిపించేను. నిజం చెప్పు, నువ్వెవరి తాలూకా?"

ఈసారి నిజం చెప్పేను, "నేను ముఖ్యమంత్రి మనిషిని"

ఆఫీసర్ గాలితీసిన బెలూనయ్యేరు. కూర్చోమని కుర్చీ చూపించేరు.

మన నిత్యజీవితంలో 'మీరెవరి తాలూకా?' అని మనల్ని అడిగే సందర్భాలు అనేకం తటస్థపడుతూ వుంటాయి.

పేటలో దాదా కూడా అడుగుతాడు 'మీరెవరి తాలూకా' అని. మీరు పోలీసు ఇన్‌స్పెక్టరుకి సంబంధించినవారైతే దాదా మిమ్మల్ని ఏమీ అనడు. ఒకసారి యిలాగే కాలేజీలో దుండగుడైన విద్యార్థిని అడిగేను, 'నువ్వెవరి తాలూకా?' అని. వెంటనే ఆ విద్యార్థి అన్నాడు, "ఎస్.పి. తాలూకా" అని. నాకు నోట మాట రాలేదు. అదృష్టవంతు డైన ఆ అబ్బాయి ఫస్ట్ క్లాసులో పాసయ్యేడు. యూనివర్సిటీ విద్యార్థి నాయకుడయ్యేడు. పి.హెచ్.డి. చేస్తున్న విద్యార్థి నడిగేను. డిపార్ట్ మెంట్ మంత్రిపేరు చెప్పాడు. మారు మాటాడకుండా ఆ మహనీయుడి థీసిస్ కూడా నేనే రాసి పెట్టేను. పాస్ కూడా చేయించేను. మీరు గాని ఒకానొక పెద్దమనిషి తాలూకా వారైతే ఏపని అయినా మీకు కష్టం కాదు. చిన్నతమ్ముడు ఎమ్.బి.బి.యస్సే కాదు ఎమ్.డీ.కూడా కాగలడు. యూనివర్సిటీల్లోను, సంస్థల్లోనూ, ప్రభుత్వాల్లోనూ చివరకు ఎన్.జీ.వో ల్లోను కూడా ఎవరికో ఒకరికి సంబంధించినవాళ్ళు బోలెడంతమంది ఉంటారు. వాళ్ళు స్వతంత్రులు కారు. కాని వెను వెంటనే ఉండే అనుచరులు. అంచేత వాళ్ళు ఎంతో పవర్‌ఫుల్. మీరు డాక్టరయి వుండి మంత్రివర్యుల తాలూకా అయితే రోగి ఎడమ కాలికి బదులు కుడికాలుకి ఆపరేషన్ చేసే అధికారం వుంటుంది. కాన్పు తర్వాత బిడ్డ ను కూడా మార్చగలుగుతారు. వెంద్రుకవాసి మీకు హానికలగదు. కార ణం? మీరు ఆరోగ్యశాఖకు సంబంధించిన మంత్రి తాలూకాగదా. డిపార్ట్ మెంట్ హెడ్ దగ్గర వుండే ఎటెండరు ఆ హెడ్‌ని తప్ప మిగతావారిని ఎందుకూ పనికిరానివాళ్ళగా చూస్తారు. చాలామంది ఐ.ఏ.ఎస్.లు ముఖ్యమంత్రి తాలూకాగానో మరేమంత్రి తాలూకాగానో అయివుంటారు.

మీరు ఎడిటర్ తాలూకా అయినట్టయితే ఇంక చెప్పేదేముంది. థర్డ్‌క్లాస్ రచనలయి పనికిరానివయినా సరే మీ రచనలు అచ్చవుతూ వుంటాయి. పారితోషికమంటారా, నలుగురికీ యిచ్చేదానికంటే మీకు రెండింతలు ముడుతుంది. అది వేరే సంగతి. మీరు డాకూ గబ్బర్ సింగు తాలూకా గాని అయితే లేదా ఆ ప్రాంతపు పోలీసు యినస్పెక్టరు తాలూకా గాని అయితే ఆ పేటంతా మీ చెప్పుచేతల్లో వుంటుంది. ఆ పేట మీకు ధారాదత్తమే నన్నమాట. మీరు ఏ చివరి నుంచి అయినా దోపిడీ మొదలుపెట్టవచ్చు. మీరు ముంబాయికి చెందిన అన్నతాలూకా అయితే ఖూనీలన్నీ మాఫీ అవుతాయి. సమీక్షకుల తాలూకా అయిన ట్టయితే కళాసాహిత్య సాంస్కృతిక రంగాల్లో మీ ప్రభావం బాగా వుంటుంది. రాత్రికి రాత్రే పెద్ద రచయితగానో కళాకారుడిగానో నటుడిగానో అయిపోతారు.

మీరింతవరకూ ఎవరి తాలూకా కాకుండా ఒక సామాన్య వ్యక్తిగానే వుంటే అది మీ సమాజానికో దేశానికో దురదృష్టకరమైన విషయమవుతుంది. అంచేత వెంటనే ఒకానొక పవర్‌ఫుల్ వ్యక్తి తాలూకా అయిపోండి. లేదా మిమ్మల్ని మీరే నేను ఫలానా వారి తాలూకా అని నలుగురిలోనూ చెప్పుకుంటూ వుండండి. దానికతను కాదు పొమ్మంటే ప్రతిపక్షం శిబిరంలోకి పారిపోతానని బెదిరించండి. వెంటనే మీ పని సానుకూలమవుతుంది. ఇంక మిమ్మల్ని జాగ్రత్తగా చూసుకొనే బాధ్యత కూడా సహజంగా అతనిదే అవుతుంది. మీకు వీసమెత్తు హాని కూడా జరగదు. ఇదంతా మీరు మారిపోవడంలో వుంది.

ఎప్పుడైతే మీరు మారిపోతారో మీ దారులన్నీ వాటంతటవే మీ ముందు స్పష్టంగా తయారుగా వుంటాయి. ప్రస్తుతం అయ్యగార్ల రోజులు. ఒక్క అయ్యగారితోనే పనులు జరగవు. కార్యం సిద్ధించేటంత వరకూ ఫలితం చేతికి చిక్కేటంతవరకూ మారుతూ మారుస్తూ వుండాలి. అయితే జాగ్రత్త పడాల్సిన విషయమొకటుంది. ఏమిటంటే ఒక్కొక్క సారి నీ ఎదుటివ్యక్తి, నువ్వెవరి తాలూకా అయివున్నావో అంతకంటే పెద్దవాడి తాలూకా అయుండవచ్చు. అలాంటి పరిస్థితిలో నువ్వు నీ పెద్దాయనను విడిచిపెట్టి అంతకంటె పెద్దాయన నీడని ఆశ్రయించాలి. నీ పనులు సానుకూలం కావాలంటే ఈమాత్రం చేయక తప్పదు. సంసార సాగరాన్ని దాటడానికి సర్వేశ్వరుని ఆశ్రయించే వారంతా ఒక్క సారి తమ గురించి పునర్విమర్శ చేసుకోవాలి. వాళ్ళంతా ఒకానొక పెద్ద మనిషి తాలూకా కావాలి. అప్పుడే భౌతిక ప్రపంచంలో ప్రగతి సాధ్య పడుతుంది. మరొక్కమాట, ఆధ్యాత్మిక లోకాన్ని ఎవరు చూసేరు?